# మంత్రిని

మన రోడ్లు కొన్ని చాలా బాగుంటాయి. వాటి అయిపోతుంది. గుండెపోటు ఉన్నవాళ్ళకు

"ఏంటున్నావా అరుణ్?" యాదగిరి రెట్టించి అడిగాడు.

"ఊఁ" అన్నాడు అరుణ్.

"ఈ రోడ్డు బాగుపడడానికి మనం ఏదో చేయాలి."

"ఊఁ."

"ఊఁ, ఆఁ తప్ప ఏవీ మాట్లాడదలచుకోలేదా?"

"మీరు మాట్లాడుతున్నారు కదా!" యాదగిరి వంక, తోడుగా ఉన్న మరో మిత్రుని వంక చూస్తూ అన్నాడు అరుణ్.

"కాదు అరుణ్, నీ ఆలోచన ఏవిటో చెప్పవేం? రోడ్డు పూర్తిగా ఖరాబు అయింది. జనం ఎంత ఇబ్బంది పడుతున్నారో చూస్తున్నావా?"

"ఊఁ."

"అదిగో మళ్ళీ ఊఁ."

"నిజమే కదా, మనమంతా ఈ రోడ్డు వల్ల ఇబ్బందులు పడుతున్నాం."

"ఏదో చేయాలని నీవెందుకు ఆలోచించవు?"

"నేను ఆలోచించడం లేదని ఎందుకనుకోవాలి?"

"మరి ఏం చేద్దామో చెప్పవేం?"

మిత్రులు ముగ్గురూ మాట్లాడుకుంటున్నారు. "అరుణ్, ఈ ఘోరం విన్నావా" అంటూ పరుగెత్తుకొని వచ్చాడు సత్యం.

ఏవిట్రా ఏమయింది?" ఆత్రంగా ఎదురు వెళ్ళాడు యాదగిరి.

"ఘోరం జరిగిపోయిందిరా." తల పట్టుకొని కుర్చీలో చతికిల పడిపోయాడు సత్యం.

"ఏం జరిగిందో చెప్పక ఘోరం జరిగిందంటే ఎలా తెలుస్తుందిరా?"

"ఏమైంది సత్యం?" సత్యం భుజం మీద చేయి వేసి అనునయంగా అరుణ్ అడిగేసరికి బావురుమన్నాడు సత్యం.

"ఏమైందిరా?" యాదగిరి కంగారు పడ్డాడు.

"దారుణం జరిగిపోయింది అరుణన్నా దారుణం జరిగిపోయింది. మా పెద్దమ్మ కూతురు సత్యవతి లేదూ..."

"ఆఁ."

"గర్భవతి..."

"ఆఁ..."

"పొద్దున అత్తగారింటి నుంచి సత్యను తీసుకొస్తున్నది మా పెద్దమ్మ. మన బస్తీ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలుసుకదా. పల్లెటూరు కచ్చా రోడ్లన్నా ఇంతకంటే నయం. ఇది ఒక రోడ్డా! అడుగడుగునా గుంతలు, అంతా కంకర కంకర. కాలి నడకే కష్టం. సత్యను తీసుకొస్తున్న ఆటో ఒకటే కుదుపులు. ఒక గుంతలో ఆటో దిబుక్కున దిగబడేసరికి ఘోరం జరిగిపోయింది యాదగిరీ, ఘోరం జరిగిపోయింది అరుణన్నా. ఘోరం జరిగిపోయింది. సత్యకు అబార్షనైపోయింది. తీవ్రంగా రక్తస్రావంతో ప్రమాదంలో ఉన్న సత్యను ఆస్పత్రిలో చేర్పించి వస్తున్నా. మావాళ్ళందరికీ చెప్పాలి. నాకు నోరు రావడం లేదు."

"అరరే, అంత ప్రమాదం జరిగిందా? ఇప్పుడు సత్య ఎట్లా ఉంది?" అరుణ్ విచారంగా అడిగాడు.

"ఇంకా ఇంటెన్సివ్ కేర్‌లోనే ఉంది. ఈ రోడ్డు మా చెల్లెలి గర్భాన్ని మింగింది. చెల్లెలి ప్రాణాన్నే తీసేట్టున్నది. ఇంకా ఎంత మందిని ఈ రోడ్డు బలి తీసుకోనుందో!"

"గర్భవతులేనా, గుండె జబ్బు మనుషులు ఈ రోడ్డుమీద ప్రయాణం చేసినా డేంజరే. రెండేండ్లాయె, మూడేండ్లకు వస్తుండె. మన గోడు పట్టించుకునేదెవరు?" ఆవేశంగా అన్నాడు యాదగిరి.

"అవును యాదగిరన్నా, చదువుకున్నోళ్ళం ఇంత మందిమి ఈ బస్తీలో ఉన్నం. కానీ, ఈ రోడ్డు ఇంత అధ్వానంగా ఉండి జనం ప్రాణాలు తీస్తుంటే, రోజుకో యాక్సిడెంట్ జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటున్నాం. ఇది సామాజిక ద్రోహం యాదగిరన్నా. ఇది మన చేతకానితనం అరుణన్నా. మనం ఏ ఆందోళనా చేయకపోతే ఈ రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోరు."

ఉద్వేగంతో యాదగిరి వెంట ఉన్న సారయ్య పిడికిలి బిగుసుకుంది.

"నేను అదే అంటున్నా తమ్మీ. ఏదైనా ఆందోళన చేయకపోతే మనల్ని పట్టించుకునేదెవరు? అరుణన్నేమో ఉలకడు పలకడు."

అరుణ్ వంక చూశాడు యాదగిరి. అరుణ్ మొహం గంభీరంగా మారిపోయింది.

"సత్యను చూడ్డానికి ఆస్పత్రికి వెళ్దాం పద యాదీ" అన్నాడు.

"వెళ్దాం. ముందు ఇది చెప్పు. ఎల్లుండి బస్తీ బంద్ పెడ్దాం."

అరుణ్ మాట్లాడలేదు.

"నువ్వు మాట్లాడవు. నాకు తెలుసు. ఏ రిస్క్ తీసుకోవు. సమాజం గురించి పట్టించుకోవు. జనం గురించి ఆలోచించవు." యాదగిరి వాపోతున్నాడు.

"నేను సత్యను చూడ్డానికి ఆస్పత్రికి వెళ్తున్నా." సత్యంను తీసుకొని అరుణ్ గబగబా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అతని వెనుకే నడుస్తూ యాదగిరి మిత్రునితో మాట్లాడుతున్నాడు. "తమ్మీ సారయ్యా, మనం అరుణన్నను సలహా అడిగి లాభం లేదురా. సత్యలాంటి సోదరీమణులెందరో ఈ రోడ్డువల్ల నరకయాతన పడుతున్నారు. రిక్షాలో ప్రయాణం చేయడమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవడమే. ఈ రోడ్డును వెంటనే బాగు చేయకపోతే ప్రజాందోళన తీవ్రతరం చేస్తామని పేపర్ స్టేట్‌మెంట్ ఇద్దాం. ఎల్లుండి బస్తీ బంద్‌కు పిలుపునిద్దాం."

"మరీ ఆలస్యం చేయొద్దు యాదగిరన్నా. ఇప్పటికే మనం అచేతనంగా ఉండడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది."

"ఇంటింటికీ పోయి, దుకాణం దుకాణానికీ పోయి ప్రచారం చేద్దాం. రోడ్డు అందరికీ కావలసిందే కదా."

"అవునన్నా, మన కర్తవ్యం మనం చేద్దాం. జనాన్ని కలుపుకుపోదాం."

* * *


వారం రోజులు గడిచాయి. బస్తీ బంద్ విజయవంతంగా జరిగింది. కానీ, ఏ మార్పూ రాలేదు. ఎట్లా ఉన్న రోడ్డు అట్లాగే ఉంది. మరిన్ని గుంతలు పడ్డాయి. ఉన్న గుంతలు మరింత లోతుకు దిగాయి. ఆ వారం రోజుల్లో మరి కొన్ని రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

యాదగిరి ఒకరోజు ఉదయం అరుణ్ ఇంటికి వచ్చాడు.


వచ్చి మళ్ళీ రోడ్డు ప్రస్తావన తెచ్చాడు.

"సత్యకు ఎట్లా ఉంది" అని అడిగాడు అరుణ్.

"కొంచెం ఫరవాలేదు."



చిత్రాలు: నర్సిం



# పిలవండి

...మీద వెళ్తుంటే గర్భవతులకు అబార్షనో, ప్రసవమో
...విముక్తి లభిస్తుంది. అలాంటి ఓ రోడ్డు కథ

"ఇంటికి తీసుకువచ్చారా?"

"ఆఁ."

"పొద్దున్నే వచ్చావ్?"

"అవునన్నా, బస్తీ బంద్ పెట్టినా సర్కార్‌కు చీమ కుట్టినట్లు లేదు. పరిస్థితిలో మార్పు లేదు. రోడ్డును పట్టించుకునేవాళ్ళు లేరన్నా. ఏం చేద్దాం?"

మౌనంగా వింటున్నాడు అరుణ్.

"నాకు రోడ్డుమీద నిల్చొని ఈ రోడ్డు బాగు చేయండి అని బిగ్గరగా అరవాలని ఉందన్నా. గుండెలు బాదుకొని ఏడ్వాలని ఉందన్నా."

"అంత బేలతనం పనికిరాదు యాదీ. అరిస్తే నీ మాట ఎవరు వింటారు? విన్నవాళ్ళు ఏం చేస్తారు?"

"అయితే, ఏమీ పట్టించుకోకుండా ఉండమంటావా?"

"అట్లా అని నేనెప్పుడూ అన్లేదు. ఒకవంక స్పందిస్తూ, ప్రతిఘటిస్తూనే పని జరిగే ఉపాయం ఏవిటో ఆలోచించి ఆ ప్రయత్నం చేయాలి."

"సరే, ఆ ఉపాయం ఏవిటో చెప్పు."

"అదే ఆలోచిస్తున్నా."

"ఇంకా ఎన్ని రోజులు ఆలోచిస్తావ్? ఈలోపు ఎన్ని ప్రమాదాలు జరుగుతాయో, ఎన్ని ప్రాణాలు పోతాయో!"

"అవును నిజమే."

"ఈ రెండు మూడు రోజుల్లో ఏదో ఒక ఆందోళన చేద్దాం."

మాట్లాడలేదు అరుణ్.

"మాట్లాడన్నా. మాకు సలహా ఇవ్వన్నా. మాకు ఉత్సాహం ఇవ్వన్నా..."

మౌనంగా వింటున్నాడు అరుణ్.

"ఎల్లుండి రాస్తా రోకో అనుకుంటున్నాం."

"కానివ్వండి."

"అంటే నువ్వు పాల్గొనవా? ఇదేం బాగా లేదన్నా. మాతో ఎందుకు కలవవు?"

"కలవను అనడం లేదు. మీ ప్రయత్నం మీరు చేయండి. వద్దనను. కానీ, దానివల్ల వెంటనే ప్రయోజనం కనిపించడం లేదు. వెంటనే ప్రయోజనం కలిగే పద్ధతి కోసం ఆలోచిస్తున్నా."

"ఏమో అరుణన్నా, నేనైతే రోజుల తరబడి ఆలోచిస్తూ, ఈ అన్యాయాన్ని చూస్తూ ఊర్కోలేను."

"ఊఁ."

"రాస్తా రోకో చేయాల్సిందే."

"కానివ్వండి."

"వస్తానన్నా."

"సరే."

అరుణ్ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు యాదగిరి.

* * *

మరో వారం రోజులు గడిచాయి.

రాస్తా రోకో విజయవంతంగా జరిగింది.

కానీ, రోడ్డు పరిస్థితిలో మార్పు లేదు, రాలేదు. పైగా మరింత అధ్వానంగా తయారైంది. ఏం చేయాలో ఆ బస్తీవాసులకు పాలుపోవడం లేదు.

ఒకరోజు ఉదయం యాదగిరి, సత్యం, జానకి ముగ్గురూ కలసి అరుణ్ వాళ్ళ ఇంటికి వచ్చారు.

"సత్యను తీసుకొస్తున్న ఆటో ఒకటే కుదుపులు. ఒక గుంతలో ఆటో దిబుక్కున దిగబడేసరికి ఘోరం జరిగిపోయింది యాదగిరీ, ఘోరం జరిగిపోయింది అరుణన్నా."

ఆ ముగ్గురూ అరుణ్‌కు ఎం.ఏలో సహాధ్యాయులు.

"అరుణన్నా, మన యూత్ అసోసియేషన్ వార్షికోత్సవానికి మంత్రిని పిలుద్దాం అన్నావట." విషయం కదిపాడు యాదగిరి.

"అరుణన్నా, నిజమా?" నిల దీస్తున్నట్టు అడిగింది జానకి. "మన బస్తీ రోడ్డు పరిస్థితి గురించి ఎంత ఆందోళన చేస్తున్నాం. ఈ మంత్రులు పట్టించుకుంటున్నారా? మన గోడు వినిపించుకుంటు న్నారా? అటువంటి మంత్రిని మన సంస్థ వార్షికోత్సవానికి పిలుద్దామా? ఇదేం బాగా లేదు అరుణ్" అంది.

"జనం కూడా మంత్రుల మీద ఆగ్రహంగా ఉన్నారు. ఇట్టి పరిస్థితిలో మంత్రిని పిలవడం జనాభీష్టానికి వ్యతిరేకంగా ఉంటుందేమో?" సత్యం తన అభిప్రాయాన్ని క్లుప్తంగా చెప్పాడు.

"వద్దు అరుణన్నా. మంత్రిని పిలవొద్దు. ఎవరైనా సోషల్ వర్కర్‌ను పిలుద్దాం. లేక ఒక ప్రజా రచయితను పిలుద్దాం. జనాన్ని ఇంకా చైతన్యవంతుల్ని చేస్తారు. ఈ రోడ్డును బాగు చేసుకునేందుకు అది ఉపయోగపడుతుంది" అన్నాడు యాదగిరి.

మౌనంగా వింటున్నాడు అరుణ్.

"మాట్లాడవేంటి అరుణన్నా? మంత్రిని పిలిచే ఆలోచన విరమించుకున్నట్లేనా?" అరుణ్ వంక చూస్తూ అడిగింది జానకి.

"లేదు జానకీ, మంత్రిగారినే పిలుస్తున్నాం. నా మాట మీద గౌరవం ఉంటే నాతో సహకరించండి.

"మన రోడ్డు పరిస్థితిని పట్టించుకోని మంత్రిని మన సంస్థ వార్షికోత్సవానికి పిలవడమా? అలా పిలిచి రోడ్డు గురించి చెబితే బాగు చేయిస్తారని నీ అంచనా?"

"ఆ నమ్మకం నాకు లేదు. బస్తీ బంద్, రాస్తా రోకో కంటే వార్షికోత్సవంలో చెబితే మంత్రిగారు రోడ్డు గురించి పట్టించుకుంటారనే నమ్మకం నాకు లేదు."

"మరెందుకు పిలవడమన్నా? ఇంకేదైనా పద్ధతిలో రోడ్డు బాగు గురించి ఆలోచిద్దాం."

"మాట్లాడవేం అరుణన్నా?"

నిలదీసి అడుగుతున్న మిత్రుల వంక శాంతంగా చూస్తూ అన్నాడు అరుణ్, "రోడ్డు బాగుపడేందుకే ఇది చేస్తున్నా."

ఆ జవాబు విని తల గోక్కున్నాడు యాదగిరి.

మిత్రుల మధ్య కొంచెంసేపు చర్చ జరిగింది. అరుణ్ ప్రయత్నం మీద తమకు నమ్మకం లేదని వాళ్ళు తేల్చేశారు.

ఆ విషయం మీద అరుణ్‌తో సహకరించమని కూడా చెప్పేశారు.

"మన్నించు అరుణన్నా. మంత్రి పాల్గొంటున్న సభను మేం బహిష్కరిస్తున్నాం" అన్నది జానకి.

"అవును, వెళ్ళొస్తాం అరుణన్నా. నీ మీద కోపం అనుకోకు. ఈ ఒక్క కార్యక్రమాన్ని మాత్రం మేం అంగీకరించడం లేదు. నీ పనికి అడ్డు రాము. వస్తాం" అని ముగ్గురూ వెళ్ళిపోయారు.

అరుణ్ అధైర్యపడలేదు. తన ప్రయత్నంలో తాను దీక్షగా పనిచేశాడు.

* * *

ఆ బస్తీలో యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం ఇంకో నాలుగు రోజులు ఉందనగా మంత్రిగారి

సెక్రటరీ ఆ ప్రాంతాన్ని సందర్శించాడు. అరుణ్‌తో సంప్రతించాడు.

"ఈ రోడ్డు మీది నుంచి మంత్రిగారి కారు రావాలా" అని అడిగాడు సెక్రటరీ.

"అవును" అన్నాడు అరుణ్.

"అమ్మో, ఈ రోడ్డు మీద మంత్రిగారి కారు నడుస్తుందా? ఆ కుదుపులు మంత్రిగారి ఆరోగ్యానికి ప్రమాదకరం. అసలే ఆయనకు గుండె జబ్బు."

"కానీ, మంత్రిగారు ఒప్పుకున్నారు. తప్పక వస్తానని మాట ఇచ్చారు. జనానికి మంత్రిగారు వస్తున్నారని తెలిసింది. ఇంటింటికీ పోయి చెప్పాను కూడా. జనమంతా మంత్రిగారి సభకు పెద్ద సంఖ్యలో రావడానికి సిద్ధంగా ఉన్నారు. కరపత్రాలు వేశాం. వాల్‌పోస్టర్లు అతికించాం."

"అది కాదయ్యా, ఇప్పుడు మంత్రిగారు రారు అని నేనడం లేదు. ఇటువంటి సభను మంత్రిగారు అస్సలు వదులుకోరు. జనమంటే మంత్రిగారికి ప్రాణం. అందులో ఈ ఏరియాలో వీకర్ సెక్షన్లు అధికంగా ఉన్నారు" అన్నాడు సెక్రటరీ.

"ఆ విషయం తెలిసే కదా, మంత్రిగారిని మా అసోసియేషన్ వార్షికోత్సవానికి పిలవాలి అనుకున్నాం."

"వస్తారు. తప్పక వస్తారు. కానీ, మంత్రిగారి కారు ఈ రోడ్డు మీది నుంచి రావాలి కదా. ఎట్లా అని ఆలోచిస్తున్నా..."

"అవును, ఇదే రోడ్డు. దాదాపు రెండు కిలోమీటర్లు. కారు కుదుపులు కష్టమైతే, హెలీకాప్టర్ దిగే స్థలమైతే లేదు. పోనీ, మంత్రిగారు నడిచి రాగలరా?"

"అమ్మమ్మా! రెండు కిలోమీటర్లు మంత్రిగారు నడుస్తారా? ఈ రోడ్డు మీద రెండు మీటర్లు కూడా అస్సలు నడవలేరు."

"వారికా శ్రమ ఇవ్వాలని మాకు లేదు. కారులోనే రానివ్వండి."

"అదే ఎలాగా అని ఆలోచిస్తున్నా." సెక్రటరీ ఆలోచిస్తున్నాడు.

"సభకు ఏర్పాట్లు చేసుకొమ్మంటున్నారు కదా." వినయంగా అడిగాడు అరుణ్.

"ఓ ఎస్. గో ఎహెడ్. అలాగే కానివ్వండి" అన్నాడు సెక్రటరీ.

*          *          *

మరునాడు పొద్దున్నే ఆ రోడ్డు మీద సందడి మొదలయింది.

దబదబ కంకర లారీలు వచ్చాయి.

గబగబ డొడ్డు కంకర, సన్న కంకర దిగింది. తారు పీపాలు పరుగెత్తుక వచ్చాయి.

రోడ్డు రోలర్ చేరింది.

మిక్సింగ్ మెషీన్ హాజరు పలికింది.

కూలీలను తోలుకొచ్చారు.

ఎంత సందడి! ఎంత సందడి!

జనం ఆశ్చర్యపోయారు. జనం తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు.

యుద్ధప్రాతిపదికన చక చక, వేగాతివేగంగా రోడ్డు మరమ్మతు పనులు సాగాయి.

గుంతలు పూడ్చేశారు.

కంకర పరిచేశారు.

రెండవ రోజు తారు పని ప్రారంభమై, మూడో రోజుకల్లా పూర్తయింది.

నాలుగవ రోజు తివాచీ పరచినట్టు అందమైన రోడ్డు. రోడ్డులాంటి రోడ్డు తయారైంది.


జానకి, యాదగిరి, సారయ్య, సత్యం – అరుణ్‌ను అభినందనలతో ముంచెత్తారు.

అరుణ్ అంతకు ముందు కుంగిపోలేదు, ఇప్పుడు పొంగిపోలేదు.

మౌనంగా మిత్రుల అభినందనలను స్వీకరించాడు. ■

# నటరాజ పాద సుమరజం!


**జాతి గర్వించదగ్గ నాట్యకోవిదునిగా ఎదిగిన నటరాజ రామకృష్ణ జీవిత ప్రస్థానం ఆంధ్ర నాట్యకళాచరిత్రతో సమ్మిళితమైన తీరుకు అక్షర దర్పణం**



అర్ధశతాబ్ది – ఆంధ్ర నాట్యం (ప్రథమార్థం)
రచన: 'పద్మశ్రీ' డాక్టర్ నటరాజ రామకృష్ణ
ప్రతులకు: రాష్ట్రంలోని విశాలాంధ్ర బుక్‌హౌస్ శాఖలన్నీ;
పేజీలు:184
వెల: రూ. 200; 60 $

**రెంటాల జయదేవ**

అభిరుచి చాలామందికే ఉంటుంది. కానీ, అభినివేశం మాత్రం కొందరిదే. నృత్యం, సంగీతం లాంటి లలితకళలలో అభిరుచి, అభినివేశం– రెండూ ఉన్నప్పటికీ, అకుంఠిత దీక్షతో ఆజన్మాంతం దానికే అంకితమయ్యేవారు మరీ అరుదు. అలాంటి అరుదైనవారిలో అగ్రగణ్యులుగా నిలిచిన వ్యక్తి నటరాజ రామకృష్ణ. పసిప్రాయం నుంచి అరవై ఆరేళ్ళ వయసులో ఈనాటి వరకూ ఆ కృషి సాగిస్తూ ఉండడమే నృత్య శాస్త్రజ్ఞుడిగా ఎదిగిన నర్తకులు నటరాజ రామకృష్ణలోని విశిష్టత! తెలుగువారు సగర్వంగా చెప్పుకోదగ్గ నాట్యాచార్యునిగా, రెండువేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆంధ్రుల నాట్యకళను చారిత్రక ఆధారాలతో సంశోధించి 50 గ్రంథాలను రచించిన కళామూర్తిగా ఆయన చిరస్మరణీయులు. జాయప సేనాని రచన నృత్త రత్నావళినీ, రామప్ప గుడిలోని శిల్పభంగిమలనూ ఆధారంగా చేసుకొని ఆయన కాకతీయుల కాలం నాటి విస్మృత నాట్య సంప్రదాయమైన 'పేరిణీ శివ తాండవా'న్ని వెలుగులోకి తెచ్చారు. కాలగర్భంలో కలిసి పోతున్న 'ఆగమ నర్తనాల'కు, 'నవజనార్దన పారిజాతం' లాంటి ప్రాచీన నృత్యాలకు జీవం పోశారు. 'అభినయ' ప్రధానమైన ఆంధ్ర 'స్త్రీల లాస్య సంప్రదాయం' కాస్తా 'ఆలయనృత్యం'గా, 'దేవదాసీల నృత్యం'గా నిరాదరణకు గురై, కనుమరుగవుతున్న తరుణంలో ఆ మధ్య రామకృష్ణ మరోమారు కార్యరంగంలోకి దిగారు. రెండు సహస్రాబ్దాల ఆంధ్రుల లాస్య సంప్రదాయానికి 'ఆంధ్రనాట్యం' పేరిట మళ్ళీ ఊపిరులూదారు.



నేటి నర్తకులకు ప్రయోగ సంప్రదాయం తెలిసినా, శాస్త్రపరిజ్ఞానం స్వల్పం. అటు నాట్యశాస్త్రం, ఇటు దాని సంప్రదాయం రెండూ తెలిసిన కళావేత్త నటరాజ రామకృష్ణ.

నిజానికి, ఆంధ్రదేశంలో ప్రధానంగా 3 రకాల నృత్యరీతులు ఉండేవి. వాటిలో మొదటిది– 'ఆగమ నృత్య రీతి' (ఆలయంలో నృత్యపూజ లేదా ఆరాధనా నృత్యాలు). రెండోది– 'ఆస్థాన కళారీతి' (రాజాస్థాన నృత్యాలు లేదా కేళికా నృత్యాలు). ఆ రెండూ 'నట్టువ మేళం' వర్గానివి. ఇక, మూడవది 'ప్రబంధ రీతి' (ప్రబంధ నృత్యాలు. అంటే కలాపాలు, భాగవతాల ప్రదర్శన). ఇది 'నాట్య మేళం' వర్గానిది. ఈ మూడింటి సమ్మేళనమే రామకృష్ణ పునరుద్ధరించిన నేటి 'ఆంధ్ర నాట్యం.' ఈ 3 రీతుల్లోని నృత్యాంశాల్ని ఒకే నర్తకి ఒక వరుసక్రమంలో రంగస్థలం మీద ప్రదర్శించడం దీని ప్రత్యేకత. ఆ రకంగా సశాస్త్రీయ స్త్రీల లాస్య నర్తనంగా ఆంధ్ర నాట్యానికి ఓ రూపం కల్పించిన రామకృష్ణ చేసిన మరో చక్కటి రచన ఈ అర్ధశతాబ్ది – ఆంధ్రనాట్యం (ప్రథమార్థం). ఇందులో ఓ కళాకారుడిగా రామకృష్ణ జీవితప్రస్థానం ఉంది. కళ్ళావచారంలోని కమనీయ ఘట్టాలున్నాయి. కళ్ళు చెమర్చే సంఘటనలున్నాయి. కదిలించి వేసే ఆర్ద్రసన్నివేశాలు, సంభాషణలున్నాయి. కళలు, కలలు, కన్నీళ్ళు కలగలిసి పలకరిస్తాయి. కళారాధననే జీవితంగా చేసుకున్నప్పుడు ఆ సహృదయుడి జీవితచరిత్ర, నాట్యకళాచరిత్ర విడదీయరానంతగా పెనవేసుకొని ఒకటై పోవడం విచిత్రం కాదు. సరిగ్గా, ఈ పుస్తకంలో అదే కనిపిస్తుంది. ఎక్కడో ఇండొనేసియాలోని 'బాలీ' ద్వీపంలో, సంపన్నుల ఇంట పుట్టి, మద్రాసు, నాగపూర్ లాంటి చోట్ల పెరిగి, కళారాధనపై మమకారంతో, మాతృభూమైన ఆంధ్రదేశంపై మక్కువతో ఇక్కడకొచ్చిన రామకృష్ణ ఆంధ్ర నాట్యకళకు సమగ్రరూపం సంతరించిన తీరు ఆశ్చర్యకరం.

ఇప్పుడు ఎంతో ప్రసిద్ధుడైనా, నాట్యజీవితం తొలిరోజుల్లో తాను పడ్డ కష్టాలు, అప్పట్లో ఎవరెవరు ఏ రకంగా తనను ఆదుకొని, రోజులు గడవడానికి సాయం చేసిందీ– దాపరికమేమీ లేకుండా రామకృష్ణ ఈ రచనలో నిజాయతీగా రాశారు. ఆ సంఘటనలు, ఉదాత్త రచనా శైలి కళ్ళను చెమరింపజేస్తాయి. ఈ రచన మొత్తం కాలక్రమానుసారంగా సాగకపోయినా, జ్ఞాపకశక్తి సాయంతో తన నాట్యకళా జీవితం తొలినాటి కబుర్లు మొదలు మలినాటి ముచ్చట్ల వరకు అన్నింటికీ రచయిత శ్రద్ధగా అక్షరరూపం ఇచ్చారు.

పసితనంలోనే తల్లిని కోల్పోయి, దాయి పెంపకంలో రామకృష్ణ పెరిగిన తీరు; అన్న శ్యామసుందరుని ద్వారా నాట్యం పట్ల కలిగిన అభిరుచి; "కళాపోషకులుగానే తప్ప కళారాధకులం కాకూడ"దన్న జమీందారీ తండ్రిని సైతం కాదని నాట్యానికే అంకితమైన విధానం; రామకృష్ణ మిషన్‌లో ఉంటూ చదువుకున్న పద్ధతి; నటుడు రమణారెడ్డి ప్రోత్సాహంతో కళాసేవలో మునిగిన వైనం– అన్నీ ఆగకుండా చదివిస్తాయి. హృదయాన్ని కదిలిస్తాయి. "స్త్రీ కళామూర్తుల లాస్యనర్తనం" గురించి ఈ ప్రథమార్థంలో ఉంది. ఇక, అపురూప సంప్రదాయ వ్యాఖ్యానంతో పురుషుల తాండవం గురించి ద్వితీయార్థం వెలువడాలి. అప్పుడు, ఆంధ్ర నాట్యకళాచరిత్ర సంపూర్తి అవుతుంది. అందుకోసం, కళాప్రియులు నటరాజ రామకృష్ణగారి వంకే చూస్తున్నారు. ■